# శృతి లేని వీణ

శ్రీమతి కె. పార్వతీదేవి

బహుశా నీవు నన్ను చూడకుండా ఉంటేనే బాగుండేదేమో! ఆ నాడు నీవు నన్ను ఈ పొన్న చెట్టుక్రింద కూర్చుని చూశావు. అయినా నీవు చెట్టుక్రింద కూర్చుని ఎంతమందిని చూడలేదు? నేను యీ చెట్టుదగ్గరకు ... ఈ పొన్న చెట్టు దగ్గరికే నదిలో స్నానంచేయటానికివచ్చాను. ఛాతీమీద సన్నని సిల్కు కండువ మాత్రమేఉంది. చేతిలో సబ్బుపెట్టెతప్ప నా దగ్గర అపుడు ఏమీ లేదు. ఒక రోజున ఈ చెట్టుక్రిందే నాకు చెప్పావు. "ఆ రోజు నేను వస్తుంటే నూనెరాసి దువ్వని నా నల్లనిజుట్టు నా ముఖంమీద నాట్యం చేస్తున్నట్లు" మెలితిరిగిన కండరాలు అందులో దబ్బపండులాంటి ఛాతితో మెరసిన వన్నావుకదూ? అప్పుడేవస్తున్న నా నూనూగు మీసాలు చూడటంతోనే కామాలు నవ్వి ఉంటావు! ఈ చెట్టు దగ్గరే నేను స్నానంచేశాను, ఇక్కడ నిశ్శంకా కూర్చొనే ఉన్నావు. ఇదే వేళలో రెండవరోజు స్నానానికివచ్చాను. నిన్నటివలెనే నీవు కూర్చుని ఉన్నావు.

కాని ఈ చెట్టే ఒక విషవృక్షమౌతుందని ఊహించలేకపోయాను. సరిగా సంవత్సరం క్రితం ఇదేవేళన ఇదేచోట నీవు నన్ను పలకరించావు. ఈ 'నేనే' నీకు సమాధానంగా చిరునవ్వు నవ్వాను. అదే నా జీవితంలో ప్రళయాన్ని సృష్టించిందా అని అనిపిస్తుందినాకు! చిరునవ్వులు సంతోషాన్ని కలగిస్తాయనే అనుకున్నానుగాని దాని పర్యవసానం విషాదాంతమనుకోలేకపోయాను. ఆ చిరునవ్వు నా జీవిత దివ్యజ్యోతి అయింది. కాని ఆ దివ్యజ్యోతి యింతలో అంధకార బంధురమైతుందని కలలోగూడ ఊహించలేకపోయాను.

సరిగా యిదే రోజున మాయింట్లో మేళాలు మ్రోగాయి. అవే నాకు ఆనందాన్ని కలిగించాయి. ఈ దౌర్భాగ్యునితో జీవితమంతా కష్టాలతో దాగుడుమూతలాడేదానికన్నా అదే మేలనుకున్నాను. కాని నా హృదయం ఉరిశిక్ష అనుభవించేవాడిలాగా ఉన్నది. సముదాయించుకొని నీ పూర్ణచంద్రముఖాన్ని చూస్తే ఆవేదన తగ్గుతుందేమో అనుకున్నాను.

అవును, ఇదే సమయానికి ఈ చెట్టు దగ్గరికివచ్చి నిలబడ్డాను. వడివడిగా ప్రవహిస్తుంది. తెల్లని వెన్నెల నల్లని నీళ్లపైబడి నిగనిగ మెరుస్తుంది. చల్లగాలి వీస్తుంది. కనులనుండి ప్రవహించేది

ఆనందాశ్రువులో దుఃఖాశ్రువులో చెప్పలేనుకాని ఆ మలయమారుతానికి ఆరిపోయినవి. గొంతురానిస్థితిలో ఉన్నది. ఈ రాతి దగ్గరకే పచ్చరంగుచీరె ధరించి వచ్చి ప్రతిమలా నిలబడ్డావు. మెడలోని నెక్లెస్ మిలమిలా మెరసిపోతుంది. నీ తెల్లని పలువరుస కనపడలేదు. నల్లని జడ వీపుపై లేదు. అపుడు నీ ఆకారం నన్ను ఆశ్చర్యనిచేసింది.

'రమా' అని పిలచాను.

'ఆఁ' అని ఊరుకున్నావు.

కాని నిన్ను చూస్తే చాల విచారం కల్గింది. నీ జీవితంకూడా ముళ్ళపొదలా ఉంటుందని అనుకోలేకపోయాను. నేను ఏమిచెప్పటానికి మనసుపోలేదు. ఈ చేతిని పట్టుకొని ... ఇదే చేతిని ... కనుల నీరు కార్చావు. ఆ నీరే నన్ను కఠినునిగా చేసినది. తప్పదన్నాను ... దుఃఖించవద్దన్నాను. అప్రతిష్టపాలు కావద్దన్నాను. ఈ పెదవులే ఈ మాటలన్నవి ఇక్కడే ... ఇదే ఒక పుణ్యస్థలము ... ఇదే ఒక నరకము.

భగవంతుడా ! ఒక స్త్రీ హృదయాన్ని గ్రహించలేనివాడిగా ఎందుకు సృష్టించావు ? మావంశం అప్రతిష్టపాలు చెయ్యవద్దని మానాన్న చెప్పినట్లు ఈ పొన్న చెట్టుక్రిందే ఇద్దరము కూర్చోన్నపుడు చెప్పావు. అపుడు అర్థం చేసికోలేకపోయాను. ఈ జీవితం నీ జీవితానికి వెలుగుగా మారుద్దామనుకొన్నాను. కాని సుడిగాలి ఆర్పివేసింది. ఈ పూలగుత్తిని యీ చెట్టుదగ్గర ఉంచుతున్నాను. రేపు కూడా నేను వస్తాను. పచ్చని చీర కట్టుకోవటము మరచిపోకు. ...

—o—

